విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 05, ఫిబ్రవరి 2025

ఎవడు ఎలా చస్తే మాకేంటి

▶ నివాసాలపై విద్యుత్ తీగెలు, పొంచి ఉన్న ప్రమాదం..
▶ మేకపోతు గాంభీర్యంతో విద్యుత్ బిల్ రీడర్..



విశాలాంధ్ర – రుద్రవరం. విద్యుత్ లైన్ లాగిన కాంట్రాక్టర్ తప్పిదమా, విద్యుత్తు సిబ్బంది తప్పిదమో తెలియదు కానీ, నివాసాలకు తగులుకుంటూ విద్యుత్ సరఫరా తీగలు ఉండడంతో ఓ దళిత కుటుంబానికి విద్యుత్ సరపర ప్రాణాంతకంగా ప్రమాదం పొంచి ఉన్న సంఘటన చిలకలూరి గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని చిలకలూరు గ్రామంలో నివాసముంటున్న దళిత కాలనీ వాసుల ఇళ్లకు విద్యుత్ తీగలు తగులుకుంటూ ఉండే విధంగా సంబంధిత విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో కరెంటు తీగలు తగులుకుంటూ ఉన్న నివాసాల కుటుంబీకులకు ప్రమాదం పొంచివుంది. ఒక స్తంభం నుండి మరొక స్తంభానికి సరఫరాను అందించే విద్యుత్తు తీగలు మరొక ఇంటి స్లాపులోనే విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో భయాందోళన చెందుతున్న కుటుంబీకులతో పాటు గ్రామస్తులు విద్యుత్ సరఫరా నిలిపి వేయాలని పిర్యాదు చేసినా ఇంతవరకు గ్రామం వైపు కన్నెత్తి చూడకుండా నిర్లక్ష్యపు వైఖరి ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. గతంలో ఎప్పుడే గాని ఇటువంటి ప్రాణాపాయ పరిస్థితి గ్రామంలో తలెత్తలేదనీ, ప్రస్తుతం విద్యుత్ స్తంభాలను ఉన్నచోట నుండి మార్చి ఇతర చోట స్తంభాలను పాతడం వల్ల రెండు నెలలుగా ఇంటికి విద్యుత్ తీగలు తగులుకుంటూ ఏ క్షణంలో ప్రమాదం సంభవిస్తుందోనని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మరో వారం రోజుల్లో లక్ష్మీ నరసింహ స్వామి పారువేట తిరునాళ గ్రామంలో జరుగుతుండడంతో తమ ఇళ్లకు రంగులు వేసుకోవాలని, బంధు మిత్రులను పిలుచుకోవాలన్నా పరిస్థితి ప్రాణాంతకంగా పొంచివుందని ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత విద్యుత్ అధికారులకు రెండు నెలలుగా చెబుతున్న తీగలను సర్దుబాటు చేయకపోవడం పట్ల ఎవడు చస్తే మాకేంటి అన్నట్లు వ్యవహరించడం అన్యాయ మనీ ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో విద్యుత్ బిల్లులను వసూలు చేసే బిల్ రీడర్ ఏఈకి ఎక్కువ, బిల్ రీడర్‌కు తక్కువ అన్నట్లు వ్యవహరిస్తు గ్రామంలో విద్యుత్ వినియోగ దారుల వట్ల దురుసుగా ప్రవర్తిస్తూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ తనపై అధికారులకు చెప్పిన తనను ఎవరేమి చేసుకోలేరంటూ నిర్లక్ష్యపు సమాధానంతో గ్రామస్తులకు జవాబు ఇస్తున్నాడన్నారు. విద్యుత్ తీగలు తగిలి ప్రాణాపాయం జరిగి, ఎవరు చస్తే మాకేంటి అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఉన్నతాధికారులు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తప్పకుండా విద్యుత్తు తీయగలను సరిచేస్తాం – ఏఈ అనిల్ : చిలకలూరు గ్రామంలో ఇళ్లకు విద్యుత్తు తీగలు తగులుకుంటూ ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. నేను కొత్తగా ఇక్కడికి వచ్చాను. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తప్పకుండా అక్కడికి వెళ్లి విద్యుత్ తీగలను సరి చేయిస్తాము.

ఐఎంఏ, ఉదయానంద ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : నంద్యాల ఐఎంఏ, ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయానంద ఆసుపత్రి వైద్యులు భార్గవరెడ్డి, క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ సాయిప్రణీత్, డాక్టర్ నాగ సుదర్శన్ రెడ్డి, క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సుస్మిత, క్యాన్సర్ రేడియేషన్ నిపుణులు డాక్టర్ సురేఖల నిర్వహణలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రి నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు క్యాన్సర్ వ్యాధిపై ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎఎస్‌పి జావళి ఆల్ఫోన్స్ జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎఎస్పీ జావళి ఆల్ఫోన్స్,మాజీ ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రావు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉదయానంద ఆసుపత్రి నిర్వాహకులు పరమేశ్వర రెడ్డి, రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి విద్యాసంస్థల చైర్మన్ కేశవరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ గేలివి సహదేవుడు, ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ నర్మద, అధ్యక్షురాలు డాక్టర్ కల్పన, కార్యదర్శి డాక్టర్ అనూష, డాక్టర్ భాగ్యలక్ష్మి, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిజాముద్దీన్, శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, సభ్యుడు మేడా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలి

విశాలాంధ్ర – నంద్యాల అర్బన్: నిరుపేదలు ఇల్లు నిర్మించుకు నేందుకు ఇళ్ల స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలని ఏఐటీయూసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. నంద్యాల పట్టణంలో ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వార్డులలో దరఖాస్తులను భర్తీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ఇల్లులేని నిరుపేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల గృహ రుణం మంజూరు చేయాలన్నారు.

దద్దనాల చెరువుకు నీరు విడుదల

విశాలాంధ్ర – బనగానపల్లె: మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సార్ బీసీ కాలువ నుండి నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా దద్దనాల చెరువుకు నీరు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద పాతపాడు గ్రామ సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, టిడిపి యువ నాయకులు శంకేశ్వర్ రెడ్డి, నారాయణ రెడ్డి, చేరుకొని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులో నీరు లేక పంట పొలాలకు నష్టం జరుగుతుందని ఈ సందర్భంగా మంత్రి చొరవ వల్ల చెరువుకు నీరు విడుదల చేయడం జరిగిందన్నారు. బీసీ జనార్దన్ రెడ్డి ప్రారంభించిన లిఫ్ట్ ఇరిగేషన్‌ను గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసి చెరువుకు నీరు విడుదల చేయలేదని అన్నారు.

కాపు బలిజలకు సబ్సిడీ రుణాలు

విశాలాంధ్ర – శిరివెళ్ల: మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఉన్న కాపు, బలిజ, తెగల, ఒంటరి, కులాలకు సంబంధించి సబ్సిడీ రుణాలు మంజూరు అయ్యాయని ఎంపీడీవో సి.శివ మల్లేశ్వరప్ప అన్నారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం మండల వ్యాప్తంగా ఐదు యూనిట్లు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. గాజులపల్లె ఏపీజీబీ, శిరివెళ్ల ఎస్‌బిఐ, శిరివెళ్ల యూనియన్ బ్యాంక్, యాల్లూరు కెనరా బ్యాంక్, శిరివెళ్ల కెనరా బ్యాంక్‌ల పరిధిలో ఒక్కొక్క యూనిట్ మంజూరు అయ్యా యన్నారు. కాపు, బలిజ, తెగల, ఒంటరి కులాల వారు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. పత్రాలను జతపరిచి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని ఈ సందర్భంగా ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యేను సత్కరించిన ఇస్తేమా కమిటీ

విశాలాంధ్ర – వెలుగోడు : ఆత్మకూరు పట్టణంలో ఇస్తే మాను విజయవంతం కావడానికి కృషిచేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని మంగళవారం ఘనంగా సత్కరించారు. వెలుగోడు మండలంలోని వేల్పనూరు ఇస్లాం కమిటీ సభ్యులు,మత పెద్దలు పాల్గొని ఇటీవల జనవరి 7, 8, 9వ తేదీల్లో జరిగిన ఆత్మకూరు ఇస్తేమా నిర్వహణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి ఎన్ఎండి ఫరూక్ సహకారంతో ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించి, అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఇస్తేమాను విజయవంతం అయ్యేందుకు సహకరించిన శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇస్తేమా కమిటీ సభ్యులు హబిబుల్లా, నూర్ బేగ్, రజాక్, ఇంజనీర్ ఇషాక్, షాలి పహిల్వాన్, మత పెద్దలు గౌస్ అజం, అల్లీసా, అశ్రఫ్ అలీ, మోటర్ షఫీ, మూర్తుజా బేగ్, కోయ మున్నా తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులతో ఎక్సైజ్ శాఖ అధికారుల సమావేశం

విశాలాంధ్ర– కోవెలకుంట్ల: మండల పరిధిలోని స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న కల్లుగీత కార్మికులకు మంగళవారం ఎక్సేంజ్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు సీఐ తక్కీ బాష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో గీత కులాల మద్యం దుకాణాలు కేటాయింపు, దరఖాస్తుల చేసుకునే విధానము మీద గీత కులాల వారితో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఆయన అన్నారు. గీత కులాల వారికి ఉయ్యాలవాడ మండలం పరిధిలో ఈడిగ కులస్తులకు ఓ మద్యము దుకాణము కేటాయించారు. ఒక్కో అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షలు, లైసెన్సు ఫీజులో సగం మాత్రమే చెల్లించేలా వెసలుబాటు కల్పించారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సందీప్ యాదవ్, ఎస్సై ప్రవీణ్ కుమార్ నాయక్ సిబ్బంది, వివిధ మండలాల కల్లు గీత కులాల వ్యక్తులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి మాతృమూర్తి మృతి

విశాలాంధ్ర – నందికొట్కూరు : సిపిఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి మాతృమూర్తి మౌలాలమ్మ రిటైర్డ్ టీచర్ 80 సంవత్సరాలు గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై, హైదరాబాదులోని యశోద హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం తుది శ్వాస విడిచారు. నేడు నంది కొట్కూరు పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

శ్రీశైలం కాలినడక భక్తులకు తాగునీటి సదుపాయం

విశాలాంధ్ర – ఆత్మకూరు టౌన్: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని శ్రీశైలం పాదయాత్రగా వెళ్లే భక్తులకు తాగునీటి సదుపాయం కల్పించడం జరిగిందని ఆత్మకూర్ డివిజనల్ డెవలప్మెంట్ అధికారి సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పెద్ద చెరువు గుండెల్లో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెంచు గిరిజనులకు రైస్ కార్డులులేని వారి, రైస్ కార్డు ఉన్న రేషన్‌రాని వారి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి స్థలాలు లేని వారి గురించి తెలుసుకున్నారు. కాలినడకన వెళ్లే పాదయాత్రలకు నీటి వసతి కోసం చేతిపంపు మరమ్మత్తులు చేపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి ప్రహలాద్, ఇన్చార్జి ఈ ఓ ఆర్ డి బాలు నాయక్, వీఆర్వోలు, సర్పంచ్ ఉడతలు నాగలక్ష్మి పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అశ్రద్ధ వద్దు

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల : కంటీ జబ్బులపై అశ్రద్ధ చేయవద్దని అవయ వాలలో కళ్ళు ప్రధాన మైనవి అని సిఐ రమేష్ బాబు అన్నారు. రహదా రులు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆశీస్సులతో మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ లలిత సుందరేశ్వరి దేవాలయ ఆవరణంలో చేయూత ఫౌండేషన్ చైర్మన్ తెలుగు యువత అధికార ప్రతినిధి మంద విజయకుమార్ ఆధ్వర్యంలో తాడపత్రి పట్టణం షబానా ఐ కేర్ వారు ఉచిత కంటి వైద్య శిబిరంను నిర్వహించారు. సీఐ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ పట్టణాలకు వెళ్లి చూపించు కోలేని పేదలు వృద్ధులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గూడూరు నాగేశ్వర్ రెడ్డి, ఉలవల నరసింహుడు, చిన్నపురెడ్డి నాగార్జున రెడ్డి, రవి, డిష్ గోపాల్, వెంకట రాముడు, మాజీ సర్పంచ్ సీతారామయ్య, మంద వెంకటేష్, బాష పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుని కళ్యాణోత్సవం

విశాలాంధ్ర-పాణ్యం: ప్రముఖ శైవ క్షేత్రం మండల పరిధి లోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం మంగళ వారం అంగరంగ వైభవంగా నిర్వహించబడినది. మాఘ మాసము శుద్ధ షష్టి శ్రీ సుబ్ర హ్మణ్యేశ్వర స్వామి జన్మదినం ను పురస్కరించుకొని ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులు హాజరు కాగా వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య స్వామి, నారాయణస్వామి, సురేష్ స్వామి,కిట్టయ్య స్వామి ఆలయ మర్యాదలతో పలికి మూల విరాట్ విగ్రహమునకు అభిషేకం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సుబ్బయ్య స్వామి, రోహిత్ స్వామి,సిఐ కిరణ్ కుమార్ రెడ్డి, నరేంద్ర కుమార్ రెడ్డి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు మిలిటరీ సుబ్బారెడ్డి, మండల నాయకులుపాల్గొన్నారు.

శ్రీరామ టాకీస్ గోడౌన్ యాజమాన్యాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర – నందికొట్కూరు : పట్టణంలోని కేజీ రోడ్డు నందున్న శ్రీరామ టాకీస్ వారి గోడౌన్‌లో మంగళవారం ఫైర్ ఆక్సిడెంట్ అయ్యింది. దీంతో రూ.6 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు గోడౌన్ యజమాని రామిరెడ్డి తెలిపినట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ప్రమాదం జరిగిన గోడౌన్‌ను సందర్శించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీరామ టాకీస్ గోడౌన్‌లో దాదాపు 900 కుర్చీలు ఉన్నాయని, వాటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని, గోడంలో గోబీ తయారు చేసే పనిముట్లు, గోబీ మేకర్, ఇతర ఫుడ్ వస్తువులు విలువ రూ.30 వేల వరకు ఉంటుందన్నారు. ప్రమాదంలో నష్టపోయిన యజమానికి నష్టపరిహారం అందించడంలో అధికారులు చొరవ చూపి చర్యలు తీసుకోవాలన్నారు.

సచివాలయాలను సందర్శించిన ఎమ్పీడీవో

విశాలాంధ్ర – శిరివెళ్ల: మండల పరిధిలోని వెంకటాపురం యర్రగుంట్ల గ్రామంలో గల గ్రామ వార్డు సచివాలయాలను ఎంపిడిఓ సి శివ మల్లేశ్వరప్ప మంగళవారం సందర్శించారు. పలు రికార్డులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. గ్రామంలోని నీటి వనరులను అడిగి తెలుసుకోని వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్త వహించాలని సకాలంలో విధులకు హాజరై ప్రభుత్వం ఆదేశించిన సర్వేలను ఎటువంటి మిస్టేక్ లు లేకుండా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు పథకాలను అందజేసేల సర్వే ఉండాలని తెలియజేశారు.

ఆరేళ్ల అనంతరం డ్రైనేజీపై ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర – శిరివెళ్ల : మండల కేంద్రము లోని శిరివెళ్ల మేజర్ పంచాయతీ గ్రామంలో కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు గ్రామపంచాయతీ ఈవో అశ్వినీ కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సిరివెళ్ల మండల కేంద్రంలో ప్రధానమైనటువంటి డ్రైనేజీ కాలువ జగతి కాలువ పూడికతీత పనులు ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికుల ద్వారా చేపట్టినట్లు ఈవో అశ్విని కుమార్ అన్నారు. ఖర్జూర వీధి ముల్లాపేట మర్కస్ మసీద్ రంభం కోత మిషన్ ఏరియా లో ప్రవహించే జాతి కాలువ సమీపంలో ఉన్నటువంటి పూర్వక నిర్మాణ కట్టడాలు కూలి కాలువలో మురికి నీటి ప్రవాహానికి ఆటంకిగా మారిందన్నారు. డ్రైనేజీ కాలువకు అడ్డంకులు లేకుండా నిర్మాణాల రాళ్లు మట్టి ఇతర వ్యర్థ పదార్థాలను జయప్రయాసులకు వచ్చి తొలగించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జాకాతి డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారం వ్యర్థ పదార్థాల నిలువలను తొలగించి ఊరికి దూరంగా ఉన్న డంపు యార్డ్‌కు తరలించామన్నారు. డ్రైనేజీ కాలువలలో వ్యర్థ పదార్థాలు చెత్తాచెదారం కవర్లు వేయడం వల్ల మురికి నీరు సరఫరాకు అడ్డంకిగా ఏర్పడి దుర్వాసన వెదజల్లుతూ ఉండగా ప్రజలు సర్పంచ్ లక్కాకుల సాలమ్మ చంద్ర కు మరియు ఈవో అశ్విని కుమార్ దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే స్పందించి కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తెలుగు పేట నుండి, ప్రధాన రహదారి నుండి జకాతి కాలువలో ప్రవహించే జంక్షన్ డ్రైనేజీ కాలువ, ప్రధాన రహదారి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కాలువలలో డ్రైనేజీ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఈఓ అశ్విని కుమార్ అన్నారు.

ఈ శ్రమ పోర్టల్‌పై అవగాహన

విశాలాంధ్ర – చాగలమర్రి : చాగలమర్రి వెలుగు కార్యాలయంలో జిల్లా లేబర్ అధికారి మురళి ఆధ్వర్యంలో ఈ శ్రమ పోర్టల్పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానిక కార్యాయలంలో ఐక్యసంఘాలు, పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు ఈ శ్రమ పోర్టల్లో నమోదు చేసుకోవడం వల్ల వారికి బీమా వర్తిస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, ఇళ్ళలో పనిచేసేవారు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, ఆశవర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పొదుపు మహిళలు, డ్రైవర్లు, హమాలీలు, పాల వ్యాపారస్తులు, ఉపాధి కూలీలు, ఇతర కూలీలు ఇందుకు అర్హులన్నారు.

మలబార్ గోల్డ్ స్కాలర్షిప్లను పంపిణీ చేసిన ఫిరోజ్

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళా శాలలో కళాశాల ప్రిన్సి పాల్ కరిముల్లా అధ్య క్షతన జరిగిన మలబార్ గోల్డ్ స్కాలర్ షిప్ పంపిణి కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహ పర్వీన్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సునీత, ఇమాముల సంఘం అధ్యక్షుడు అంజాద్ సిద్ధికి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫిరోజ్ మాట్లాడుతూ మలబార్ ట్రస్ట్ వారు 21 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి పదివేల చొప్పున స్కాలర్షిప్ల ఇవ్వడం జరిగిందని, దాదాపు రెండు లక్షల రూపాయలు విద్యార్థులకు అందజేశారు. ఇది చాలా హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులకు కళాశాలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థినులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎబినేజర్, వేణు, నాగేశ్వరరావు, రవి, గోవిందునాయుడు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు తీర్చడానికే పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర – చాగలమర్రి : రైతుల సమస్యలు తీర్చడానికే పొలం పిలుస్తోంది కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దబోధనం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కజొన్న పంటలో చీడపీడల గురించి తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు వేపనూనె 10 వేల పిపిఎం 2-3 మి.లీ/లీ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ల్యాంబ్డాసహ్యాలోత్రిన్ లేదా ఎమామెక్టిన్ బెంజొయేట్ మందును పిచికారి చేయాలన్నారు. కంది పంట సాగు చేసిన రైతులకు ప్రభుత్వం క్వింటాలుకు 7550 రూపాయలు మద్దతు ధరతో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కంది కొనుగోలు కేంద్రమును ఆళ్ళగడ్డ మార్కెట్ యార్డు నందు ఏర్పాటు చేసారన్నారు. కంది సాగు చేసిన రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకొని కేటాయించిన తేదీ ప్రకారం కొనుగోలు కేంద్రం వద్ద అమ్ముకో వచ్చునని తెలిపారు. వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని తిరుమల ఫోటో స్టూడియో సుబ్బ రాయుడు బ్రదర్స్ నిరు పేదలకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అహోబిల లక్ష్మీనరసింహా స్వామి పారువేట ఉత్సవం సందర్భం గా తమ తండ్రి పెద్ద సుబ్బన్న జ్ఞాపకార్థంగా వారి కుమారులు తిరుమల ఫోటో స్టూడియో సుబ్బారాయుడు, చిన్న సుబ్బారాయుడు, వెంకటేష్‌లు పట్టణ సిఐ చిరంజీవి చేతుల మీదుగా 30 మంది నిరుపేదలకి వస్త్రాలు, దుపట్లను అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు సోదరులను సీఐ చిరంజీవి అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించండి

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండించడం వల్ల అధిక లాభాలు వస్తాయని సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, నరేంద్ర రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, డిఆర్డిఏ ప్రాజెక్టు శ్రీధర్ రెడ్డి, డిపిఎం నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక లాభాలను ఇచ్చే ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్న తీరు తెన్నులను సమీక్షిస్తూ రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో రైతుల అవగాహన కోసం ఐదు మోడల్ ప్రాజెక్టులు ఎంపిక చేయాలని సూచించారు.

అగ్ని ప్రమాదం రెండుగడ్డివాములు దగ్ధం

విశాలాంధ్ర – బనగానపల్లె: మండల పరిధిలోని మిట్టపల్లె గ్రామ శివారులో అగ్ని ప్రమాదం చోటు చేసు కుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన నాగలక్ష్మ, సంకటి దస్తగిరి చెందిన పశువుల గడ్డివాము కాలిపోయింది. బనగానపల్లి ఫైర్ స్టేషన్ నుంచి ఫైర్ ఇంజన్ అగ్ని ప్రమాద స్థలానికి చేరి మంటలు ఆర్పి వేసింది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే గ్రామ సర్పంచ్ యడమ కంటి తులసి రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకొని పర్యవేక్షించారు. బాల హుస్సేన్ రెడ్డి, చిన్న హుసేన్ రెడ్డి, రమణారెడ్డి, లోకేష్ రెడ్డి, చిన్న గోపాల్ రెడ్డి, లాజర్ మంటలు ఆర్పేందుకు తమ వంతు కృషి చేశారు.

శ్రీరంగాపురం, డీకొట్టాల సమీపంలో క్షుద్ర పూజలు

విశాలాంధ్ర – రుద్రవరం: మండలంలోని శ్రీరంగాపురం, డి.కొట్టాల గ్రామాల సమీపంలో క్షుద్ర పూజలు జరిగినట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు తెలుగంగ 17వ ఉపకాలవలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పసుపు, కుంకుమ, నిమ్మ కాయలు, పూలు, బియ్యం, తదితర వస్తువులతో ముగ్గు వేసినట్లు తెలిపారు. ఈ ముగ్గు మనిషి ఆకారంలో ఉన్నట్లు తెలిపారు. క్షుద్ర పూజలు గుప్తనిధుల కోసం చేశారా లేక ఎవరికైనా హాని తలపెట్టడానికి చేశారా అనే అనుమానం ప్రజలు వ్యక్తం చేశారు. క్షుద్ర పూజలు జరిగిన ప్రాంతంలో పంట పొలాలు ఉండడంతో రైతులు ఆ ప్రాంతానికి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకోవడానికి భయపడుతు న్నారని గ్రామస్తులు తెలిపారు. ఇలా క్షుద్ర పూజలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : శ్రీ లక్ష్మి నరసింహ స్వామి పారువేట ఉత్సవాల సందర్భంగా అట్లా శ్రీదేవి కుమారుడు అట్లా హర్షవర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్ దంపతులను సన్మానించారు. పట్టణంలోని పాతూరు వీధికి చెందిన అట్లా శ్రీదేవి కుమారుడు అట్లా హర్షవర్ధన్ రెడ్డి ఆహ్వానం మేరకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, తాలూకా టిడిపి యువ నాయకులు భార్గవ్ రామ్ దంపతులు విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని అట్లా హర్షవర్ధన్ రెడ్డి కుటుంబసభ్యులు సన్మానించారు. కాగా పాతూరి వీధికి పారువేట ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ రావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ బాష, టిడిపి మండల కన్వీనర్ శీలం హరి కుమార్ రెడ్డి, శివ యాదవ్ పాల్గొన్నారు.

రథసప్తమిని పురస్కరించుకుని సూర్యారాధన

విశాలాంధ్ర – శ్రీశైలం: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలంలోని అక్కమహాదేవి అలంకరణ మండపంలో సూర్యారాధనను అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశం శాంతి, సౌభాగ్యాలతో వెలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు నివారించబడి, సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, దేశంలోనే ప్రజలంతా ఆయురారో గ్యాలతో సుఖంగా ఉండాలని సంకల్పం పట్టించారు. అనంతరం కలిసి స్థాపన గణపతి మహా గణపతి పూజ వైదిక ఆచార్యులు ఆయాబీజ మంత్రాల తోనూ ప్రత్యేక ముద్రలతోనూ సూర్య నమస్కారాలు చేశారు. సూర్య యంత్ర పూజ వేద పారాయణ సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు సాంప్రదాయబద్ధంగా అర్చక స్వాములు నిర్వహించారు. ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, ఆలయ అర్చక వేద పండితులు పాల్గొన్నారు.

పరివార దేవతామూర్తులకు పూజలు: శ్రీశైల మహా క్షేత్రంలో లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ సర్కారీ సేవలో భాగంగా దేవస్థానం వారు సుబ్రహ్మణ్యస్వామి, నందీశ్వరుడు, బయలువీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్రతి మంగళవారం కృత్తిక నక్షత్ర షష్టి తిధి రోజుల్లో సుబ్రమణ్య స్వామికి, ప్రతి మంగళవారం, త్రయోదశి రోజున నందీశ్వరునికి, అమావాస్య రోజు బయలువీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా దేవస్థానం వారే దేవతామూర్తులకు సర్కారీ సేవగా షోడా శోపచార పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పట్టిస్తారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 05, ఫిబ్రవరి 2025

జిల్లాకు యూనివర్సిటీ అడిగితే జైలుకు పంపడమేంటి..

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులపై దుర్భాషలాడి, దాడి చేసిన అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్, సీఐలను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. విద్యార్థి నాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలంటూ ఏఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా సమితి ఆధ్వర్యంలోన స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీనఅన్నమయ్య జిల్లా, రాయచోటి నియోజవర్గం సంబేపల్లిలో నిర్వహించిన ముఖ్యమంత్రి సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకత్వం అన్నమయ్య జిల్లాలో ఉన్న బీటి కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దని ముఖ్యమంత్రి ముందు నిరసన వ్యక్తం చేయగా, పోలీసులు అత్యుత్సాహంతో ఆరుగురు నాయకులను అరెస్టు చేసి సంబేపల్లి స్టేషన్‌లో వారిని కొట్టడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయకులను కొట్టారని తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 2వ తేదీన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ ను జడ్జిగారు ముందు హాజరు పరిచి సబ్ జైలుకు పంపడం జరిగిందని అన్నారు. ఎస్పీ విద్యాసాగర్ ఏఐఎస్ఎఫ్ నాయకులను దుర్భాషలాడుతూ మరొకసారి కనిపిస్తే కాల్చేస్తాను అని బెదిరించారని అన్నారు. విద్యార్థుల పక్షాన న్యాయమైన డిమాండ్లను నెరవేర్చమని అడిగితే నాయకులను కొట్టి జైలుకు పంపుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలో భాగంగా అన్నమయ్య జిల్లాలో ఒక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చింది ఈ చంద్రబాబేనని, ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడిగితే ఈ విధమైన చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అభి, సి.అశోక్ నగర నాయకులు అజయ్, విజయ్ అరవింద్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు

చిన్న వ్యాపారస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి : ఎస్.మునెప్ప

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : చిన్న వ్యాపారస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి ఎస్ మునెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని వినాయక ఘాట్, కేసీ కెనాల్ ప్రక్కన రోడ్డు సైడ్ తోపుడు బండ్లు, షెడ్లలో వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాను ఎస్.మునెప్ప ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి కర్నూల్ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా నగర అధ్యక్షులు బి.వెంకటేష్, ఉపాధ్యక్షులు పి.రామకృష్ణారెడ్డి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణారెడ్డి, చిన్న వ్యాపారస్థుల సంఘం నగర కార్యదర్శి చింతల, మహేష్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.ఈశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై, ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ కర్నూలు నగరంలో అనేక గ్రామాల నుండి వలస వచ్చి ఉపాధి అవకాశాలు లేక కుటుంబాలను పోషించుకోవడానికి రోడ్డు సైడ్ తోపుడు బండ్లపైన చిన్న, చిన్న బంకుల్లో, షెడ్లు వేసుకుని కూరగాయలు, పండ్లు టిఫిన్లు అమ్ముకుంటూ వేలాదిమంది కార్మికులు జీవిస్తున్నారన్నారు. వీరికి వ్యాపారాలు బాగా జరిగితే లాభం లేకపోతే నష్టం అనే పద్ధతులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రోడ్డుపై బండ్ల పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్న చిన్న వ్యాపారుల పట్ల మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సానుభూతి తో ఉండాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది కాకుండా, ప్రధానమైన కూడలిలో చిన్న వ్యాపారస్తులకు ప్రభుత్వమే షెడ్లు నిర్మించి, వ్యాపారాలు చేసుకునేందుకు సహాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో నల్లన్న, పురుషోత్తము, రేణుక, బాష చిన్న వ్యాపారస్తులు గిడ్డయ్య, రమేష్ సరస్వతి, లక్ష్మీదేవి, జయరాముడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం చుట్టూ తిప్పుకుంటే సహించను

విశాలాంధ్ర - హెరాళగుంద: మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటే సహించనని సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భారద్వాజ్ అధికారులని హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేసి అధికారుల పనితీరు గురించి తెలుసుకున్నారు. రీసర్వే పనులు ఎలా జరుగుతున్నాయని రెవెన్యూ సమస్యలను పెండింగ్లో ఎందుకు ఉంచుకున్నారంటూ గదమాయించారు. సకాలంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సిబ్బంది ద్వారా విచారించి పరిష్కరిస్తే రెవెన్యూ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. వీఆర్వోలు గ్రామాల్లో ఉండకుండా ఇక్కడ ఎందుకు ఉన్నారంటూ గట్టిగ ప్రశ్నించారు. వివిధ సమస్యల కోసం వచ్చిన ప్రజలను దగ్గరకు సమస్యను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలంటూ తహశీల్దార్ నిజాముద్దీన్ కు ఆదేశించారు. సబ్ కలెక్టర్ వెంట డిప్యూటీల్యాండ్ సర్వేయర్ వేణు సూర్య, తాసిల్దార్ నిజాముద్దీన్, వీఆర్వోలు నాగరాజ్, తిప్పన్న, లక్ష్మీ నారాయణ రెడ్డి, దామోదర్, మల్లేష్, సురాంజనేయ, గ్రామ సేవకులు మల్లయ్య, భీమ, భీమ లింగ, మౌలాలిహాజరయ్యారు.

సీపీఐ కార్యాలయం కోసం స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర - హెరాళగుంద: సిపిఐ ఆఫీస్ కోసం స్థలం కేటాయించాలని సబ్ కలెక్టర్‌కు మంగళ వారం వినతి పత్రం ఇచ్చారు. మండల కేంద్రమైన హెరాళ గుంద తహశీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనఖీ చేశారు. మండల కేంద్రమైన హెరాళగుందలో స్థానికంగా ఆఫీసుకు స్థలాన్ని కేటాయించాలని సిపిఐ మండల కార్యదర్శి బి.మారెప్ప కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి కె.రంగన్న, రైతు సంఘం మండల కార్యదర్శి కృష్ణయ్య పాల్గొన్నారు.

ఏబీఎన్ కెమెరామెన్ సురేంద్ర మృతికి సంతాపం

విశాలాంధ్ర - కర్నూలు : ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కెమెరా మెన్ సురేంద్ర మృతి బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి ఎస్.మునెప్ప, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.చంద్రశేఖర్, వెంకటేష్, సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్‌లు అన్నారు. మంగళవారం అనారోగ్యంతో అకస్మికంగా మృతి చెందిన సురేంద్ర మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. సురేంద్ర మృతికి సంతాపం తెలియచేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. సానుభూతి తెలియచేసిన వారిలో ఏఐటీయూసీ నాయకులు ఆర్.కృష్ణారెడ్డి, ఆటో యూనియన్ నాయకులు ఈశ్వర్, రాము, ఈశ్వర్ రెడ్డి హెూటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పురుషోత్తం, బాష నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.

పత్రాలు ఇచ్చారు.. ఇంటి తాళలు ఇవ్వడం మరిచారు : సీపీఐ

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: పట్టణ శివనగర్ ప్రాంతంలో నిర్మించిన టీడ్కో గృహాలు అర్హులైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చి, ఇంటి తాళాలు మరిచారని, తక్షణమే లబ్ధిదారులకు ఇంటి తాళాల ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న కోరారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం రోజున లబ్ధిదారులతో మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, నాయకులు కేసీ జబ్బార్ మాట్లాడుతూ 2014 అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి, గూడులేని నిరుపేదల కోసం నిర్మించిన టీడ్కో గృహాలు పూర్తి స్థాయిలో నిర్మాణం అయినప్పటికీ అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చి ఇంటి తాళాలు ఇవ్వకుండా చేతులు దులుపేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే శివన్న నగర్ కాలనీలో ఉన్న టీడ్కో గృహాలలో జనాలు లేక ఆ గృహాలలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలగా మారాయని కాబట్టి తక్షణమే స్పందించి, లబ్ధిదారులకు ఇంటి తాళాలు ఇవ్వాలని కోరారు.

ఘనంగా మక్తుం మొహిద్దిన్ జయంతి వేడుకలు



విశాలాంధ్ర- పత్తికొండ: స్థానిక ఎస్‌టీయు ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం రూపకర్త, వ్యవస్థాపకులు, శాసన సభ, శాసన మండలి సభ్యులు, ప్రగతిశీల భావాలతో పండితుల పక్షాన కలమెత్తి నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడు మక్తుం మొహిద్దీన్ 117వ జయంతి ఎస్‌టియు మండల అధ్యక్షులు చంద్ర శేఖర్ అధ్యక్షతన మక్తుమ్మొహిద్దీన్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి రామమోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బలరాముడు, ఉపాధ్యక్షులు మండ్ల వెంకటేశ్వర్లు, నాయకులు ఇక్బాల్ హుస్సేన్, కిరణ్ కుమార్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర - ఆస్పరి : పదవ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్టియు జిల్లా అసోసియేటివ్ ప్రెసిడెంట్ నాగేంద్రప్ప ఆకాంక్షించారు. మంగళవారం మండల పరిధిలోని బిల్లేకల్లు, కైరుప్పల, కారుమంచి, ములుగుందం గ్రామాల్లోనే జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరంలో ఎస్టీయూ తయారుచేసి ముద్రించిన స్టడీ మెటీరియల్ ను ఎస్టీయూ జిల్లా అసోసియేటివ్ ప్రెసిడెంట్ నాగేంద్రప్ప, జిల్లా సీనియర్ నాయకులు నాగరాజు, ఎల్లప్ప, నాగరాజు, శ్రీనివాసులు, జ్యోతిమూర్తి, విశ్వనాథ్, నాగరాజు, రామాంజిని, ఉరుకుందులు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి నీటి బోరు ఏర్పాటు

విశాలాంధ్ర -గూడూరు: పట్టణంలోని సింగనగేరి కాలనీ గజ్జలమ్మ గుడి సమీపంలో మంచి నీటి బోరు ఏర్పాటు చేశారు. కోడుమూరు నియోజక వర్గం టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగుల దస్తగిరి సహకారంతో మంగళవారం మంచినీటి బోరును ఏర్పాటు చేసినట్లు పట్టణ కో-ఆప్షన్ సభ్యులు, వాల్మీకి పట్టణ అధ్యక్షుడు పి.రామాంజనేయులు తెలిపారు. మంచి నీటి బోరు ఏర్పాటుతో కాలని ప్రజలకు తాగనీటి దాహోర్తి తీరిందని అందుకు సహకరించిన విష్ణువర్ధన్ రెడ్డికి స్థానిక టిడిపి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు నాయుడు, బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార జైలు శిక్ష, జరిమానా



విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: వ్యక్తిని దారుణంగా హత్యచేసిన వ్యక్తికి కోర్టు యావజ్జీవ కాగారార శిక్ష వేస్తూ జరిమాన విధించినట్లు కర్నూలు పీడీజే కోర్టు మంగళ =వారం తీర్పు నిచ్చింది. ముద్దాయి నంది కొట్కూరుకు చెందిన కురువ రవి హత్యకు గురి కాబడిన వ్యక్తి పగిడ్యాల మండలం, గణాపురం గ్రామానికి చెందిన కురువ వెంకట రమణ ఇద్దరూ స్నేహితులు. కురువ రవి తన అవసరాల నిమిత్తం వెంకట రమణ వద్ద నుండి రూ. 16 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఎన్ని రోజులైనా ఇవ్వనందున, వెంకటరమణ తరుచూ అడుగుతున్నందున, ఎలాగైనా వెంకటరమణను చంపాలని పథకం పన్నారు. అతనిని రవి అత్తగారి గ్రామము అయిన రుద్రవరం నకు వస్తే ఇవ్వ వలసిన డబ్బు ఇప్పిస్తాను అని చెప్పగా, సదరు వెంకటరమణను బి. తాండ్రపాడు గ్రామ సమీపములో గల హంద్రీనీవా సృజల స్రవంతి కెనాల్ గట్టు దెగ్గరకు పిలుచుకొనిపోయి, ముద్దాయి అయిన రవి తన వద్ద ఉన్న పిడిబాకు తో వెంకటరమణ పై దాడి చేసి హతమార్చినాడు. సదరు ఘటనకు సంబందించి కురువ వెంకటరమణ తండ్రి అయిన కురువ చంద్రుడు పిర్యాదు మేరకు సీఆర్ నెం 41/2017 యూ/సి 302, 201 ఐపీసీ క్రింద కర్నూల్ తాలూకా పోలీస్ స్టేషన్ నందు అప్పటి సి.ఐ సి.మహేశ్వర రెడ్డి కేసు నమోదు చేశారు.కేసు దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు.ప్రస్తుత కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీధర్ కేసుకు సంభందించిన సాక్షులను క్రమం తప్ప కుండా వాయిదాలకు కోర్టులో హాజరు అయ్యేలా చూసి ముద్దాయికి శిక్ష పడేలా ప్రయత్నం చేసినారు. అన్ని కోణాల్లో విచారించిన జిల్లా కోర్టు జడ్జి వారు, ముద్దాయికి యావజ్జీవ కారాగార జైలు శిక్ష, రూ.5 వేలు జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు.

కామ్రేడ్ అయ్యన్న జీవితం ఆదర్శనీయం : సీపీఐ

విశాలాంధ్ర-పత్తికొండ: కామ్రేడ్ అయ్యన్న జీవితం ఆదర్శనీయం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నబి రసూల్, డి.రాజా సాహెబ్, మద్దిలేటి శెట్టిలు అన్నారు. మంగళవారం మండలంలోని పందికోన గ్రామంలో కామ్రేడ్ అయ్యన్న పదో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అయ్యన్న స్వగృహం నుండి సిపిఐ నాయకులు కుటుంబ సభ్యులతో కలిసి హంద్రీనీవా కాలువ గట్టుపై ఉన్న స్థూపం దగ్గరకు ర్యాలీగా వచ్చి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ అయ్యన్న విద్యార్థి దశ నుండే ఉద్యమాలవైపు ఆకర్షితులై సీపీఐలో అంచలంచలుగా ఎదిగి గ్రామస్థాయి నుండి మండల కార్యదర్శిగా, ఎంపీటీసీ సభ్యులుగా గెలుపొంది పేద ప్రజల సమస్యలపై అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టారని కొనియాడారు. పందికొనలో పెత్తందారులకు వ్యతిరేకంగా దోపిడీలేని సమాజ నిర్మాణం కోసం అయ్యన్న చేసిన ఉద్యమాలు మరువలేనివని అన్నారు. అయ్యన్న ఆశయ సాధనకు ఉద్యమాలు చేపడతామని పిలుపునిచ్చారు. పందికోన శాఖ కార్యదర్శి జోహారాపురం కాశి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, కృష్ణయ్య, తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, మండల సహాయ కార్యదర్శి రంగన్న, మునిస్వామి, టీడీపీ నాయకులు కడవల సుధాకర్, కాసిం, వైసిపి నాయకులు కారం నాగరాజు, గ్రామ సిపిఐ నాయకులు పెద్ద ముని, కౌలుట్ల, నరసింహులు, వసంత, అయ్యన్న కుమారులు రవికుమార్, చంద్ర, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్దే కూటమి ధ్యేయం

విశాలాంధ్ర - ఓర్వకల్లు : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో రూ.24 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని, మీది వేములరోడ్డు బిల్డింగులు, జంగాల ఏరియాల్లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, అంబేద్కర్ భవనం దగ్గర ఎస్సీ కాలనీలో 5 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభించి, బంగ్లా ఏరియాలో 10 లక్షల రూపాయలతో డ్రైనేజీ కాలువలు సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంథాలయ నిర్మాణానికి స్థల దాతలు ఎద్దుల శేషాచలం రెడ్డి, రామేశ్వరమ్మ దంపతులు వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. నూతనంగా నిర్మించిన గ్రంథాలయంలోని పుస్తకాలను విద్యార్థులు యువకులు గ్రామంలోని ప్రతి ఒక్కరూ చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ నరేంద్ర నాథ్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి, విజయుడు, కాజా మియ్య, సర్కార్ హుస్సేన్, శ్రీరెడ్డి మనోహర్ రెడ్డి, పటేల మోహన్ పాల్గొన్నారు.

మహిళా హత్య కేసులో నిందితుడు అరెస్టు

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని రాతన కొత్తూరు గ్రామం లో సోమవారం షేక్ మా బున్నీ (32) అనే మహిళను భర్త షేక్ అక్బర్ వలీ హత్యచేసినట్లు నిర్ధారణ కావడంతో మంగళవారం హత్య చేసిన షేక్ అక్బర్ వలిను పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్, తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి తమ సిబ్బంది కలిసి మంగళవారం అరెస్టు చేసినట్లు పత్తికొండ డిఎస్పి వెంకటరామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య చేసిన నిందితున్ని షేక్ అక్బర్ వలిని హాజరు పరిచారు. అనంతరం డిఎస్పి వెంకటరామయ్య మాట్లాడుతూ రాతన కొత్తూరు గ్రామానికి చెందిన షేక్ మాబున్నీను చెన్నంపల్లి గ్రామానికి చెందిన అక్బర్ వలితో వివాహం జరిగిందని, అయితే కొంతకాలం తర్వాత షేక్ మాబున్ని భర్తను వదిలేసి తమ తల్లిదండ్రుల వద్ద రాతను కొత్తూరు గ్రామంలో నివాసం ఉందన్నారు. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో రాతన కొత్తూరు గ్రామంలోనే తమ తల్లిదండ్రుల పొలంలో షేక్ మాబున్ని వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉండగా, ఆమె భర్త షేక్ అక్బర్ వలి అక్కడికి వెళ్లి ఆమెను పిడుబాకుతో పొడిచి చంపినట్లు తెలిపారు. హత్య చేసిన నిందితుడు షేక్ అక్బర్ వలిను రూరల్ సీఐ పులి శేఖర్ ఎస్ఐ కృష్ణమూర్తి, తమ సిబ్బంది చాకచక్యంగా సకాలంలో గుర్తించి, అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. దీంతో జిల్లా ఎస్పీ వీరందరిని అభినందించారు.

భూ వివాద సమస్యపై విచారణ చేపట్టాం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు రెవిన్యూ పంచాయతీలో భూ వివాద సమస్యపై విచారణ చేపట్టినట్లు తహశీల్దార్ దేవచంద్రశేఖర్ మంగళవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ సర్వేనెంబర్ 1065లో దాదాపు 3 ఎకరాలు పొలంలో ఆన్లైన్లో ఒకరు ఉన్నారు భూమి సాగులో మరొకరు ఉన్నందున వివాదం తలెత్తిందన్నారు. మన్నెకుంట గిడ్డయ్య ఫిర్యాదు మేరకు మన్నెగుంట గ్రామానికి చెందిన గిడ్డయ్య భూమిసాగులో ఉన్నాడు. కర్నూలుకు చెందిన ఒక వ్యక్తి ఆన్లైన్లో ఉండడంతో వివాదం ఏర్పడిందన్నారు. నోటీసు ఆధారంగా క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించామన్నారు. చుట్టుపక్కల ఉన్న రైతులతో విచారించడం జరిగిందన్నారు. విచారించిన నివేదికను ఉన్నదాకారులకు పంపిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రాజశేఖర్ రెడ్డి, అయ్యన్న, సర్వేర్, రైతులు సోమలింగడు గిడ్డయ్య తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం ఉదయం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సులో డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం క్యాన్సర్ నివారణకు పూర్తిస్థాయిలో ప్రాధాన్యతనిస్తుందని అందులో భాగంగానే కర్నూల్ స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ప్రారంభించడం జరిగిందని 20 సంవత్సరాల ముందు క్యాన్సర్ ఈ స్థాయిలో లేదని అప్పటి ప్రజల ఆహార విధానాలు జీవనశైలి మంచి అలవాట్లతో కూడి ఉందన్నారు.

తుస్సుమన్న మండల సర్వసభ్య సమావేశం

▸ హాజరుకానీ ఎంపీటీసీలు

విశాలాంధ్ర - తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలో మంగళవారం సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సి ఉంది. ఈ సమావేశానికి 11:30 గంటలు అయినా ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో సర్వసభ్య సమావేశం కాస్త తుస్సుమంది. ఈసర్వసభ్య సమావేశంకు ఎంపీటీసీలు హాజరు కాకపోవడానికి కారణము లేకపోలేదు. మండల అధికారులు, నాయకులు ప్రోటోకాల్ పాటించడం లేదని, అభివృద్ధి పనులలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో నిర్మిస్తున్న వాటిపై ప్రోటోకాల్ ప్రకారం ఎంపీడీఓ, ఎంపీపీ, ఎంపీటీసీల పేర్లను పెట్టాలి. అలా కాకుండా ఇష్టం వచ్చినట్లు పెట్టడం ఎంపీటీసీలకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం, గ్రామ అభివృద్ధికై ఎటువంటి తీర్మానాలు తెలుపక పోవడంపై ఆగ్రహించిన ఎంపీటీసీలు ఈ సర్వసభ్య సమావేశానికిగై హాజరు అయినట్లు సమాచారం. ఈ సమావేశాన్ని 5వ తారీకుకు వాయిదా వేసినట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించడంలో ఎంపీడీవో విఫలం

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ఎంపీడీఓ జయరాముడు పూర్తిగా విఫలం చెందారని సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక లక్ష్మీ పేటలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును గత 30 ఏళ్ల కిందట నిర్మించారని తెలిపారు. ఇప్పుడు ట్యాంకు శిధిలావ స్థితిలో ఉండి కూలడానికి సిద్ధంగా ఉందన్నారు. ట్యాంకుకు చుట్టూ ఇనుప కడ్డీలు తేలడంతో ఎప్పుడు కూలుతుందోనని చుట్టూ ఉన్న ప్రజలు భయందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలో ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ స్పందించడం లేదన్నారు. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకును కూల్చి పునర్నాణం చేపట్టాలని లేదా వేరోచోట ట్యాంకు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామాల్లో డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సమస్యలు ఉన్నా ఎంపీడీఓ సీటుకే పరిమితమయ్యారు తప్ప పరిష్కరించడం లేదన్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎంపీడీఓ పై చర్యలు తీసుకోవాలని, పెద్దకడబూరుకు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్ నాగరాజు స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, వీరాంజనేయులు గౌడ్, తిక్కన్న, రెక్కల గిడ్డయ్య, వీరేష్, వీరాంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట

విశాలాంధ్ర-గూడూరు: ఆహారపు అలవాట్లు మార్చుకోవడం, మానసిక ఆందోళన నుండి బయటపడడం ద్వారా క్యాన్సర్ మహమ్మారికి అడ్డుకట్ట వేయవచ్చని డాక్టర్ షఫీయా అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ నియంత్రణపై పలువురికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ షఫీయా మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ప్రబలడానికి అనేక కారణాలు ఉన్నాయని, దూరాలవాట్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. హెల్త్ సూపర్వైజర్ పి.కృష్ణారెడ్డి, రామకృష్ణయ్య ,రాఘవయ్య, శాంతకుమారి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు తడకనపల్లెకు ఎమ్మెల్యే రాక

విశాలాంధ్ర కల్లూరు: ఈ నెల 5న కల్లూరు మండలం తడకనపల్లె గ్రామానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి వస్తున్నట్లు గ్రామ సర్పంచ్ సహారా బీ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ తడకనపల్లె గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే వస్తున్నట్లు అన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నాలుగో బాలోత్సవాలకు రంగం సిద్ధం



విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ప్రతిఏటా జరిగే పిల్లల సందడి ఈ యేడాది మొదలైందని, పిల్లల సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసి సహజ మేధస్సును సమాజనిర్మాణానికి అందించే లక్ష్యంతో బాలోత్సవాలను నిర్వహిస్తున్నామని ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య వెల్లడించారు. నగరంలోని రవీంద్ర బాలికల పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఏబీఎన్ వీడియో గ్రాఫర్ మృతికి కమిటీ సంతాపం తెలిపింది. అనంతరం బాలోత్సవాన్ని ఉద్దేశించి పుల్లయ్య మాట్లాడుతూ ఇది నాల్గవ బాలోత్సవ పండుగ అని, ఇండస్ పాఠశాల వేదికగా మూడు ప్రధాన వేదికల్లో బాలోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు జంధ్యాల రఘుబాబు, రంగస్వామి, రమాదేవి, జయరాజు, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో సభ్యులు నరసింహ, సాయి ఉదయ్, వినయ్ కుమార్, చంద్ర మోహన్, మునిస్వామి పాల్గొన్నారు.

దేవర ఉత్సవానికి దేవి ఆలయం ముస్తాబు

విశాలాంధ్ర - హెరాళగుంద : మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో బుధవారం జరిగే శ్రీ ఆదివరాశక్తి శ్రీ మారెమ్మ దేవి దేవర ఉత్సవాల సందర్భంగా అమ్మ వారి ఆలయం సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారికి మంగళవారం ప్రత్యేక గంగి పూజ, కుంకుమార్చన పూజలు, అభిషేకాధి పూజలు, మంగళ హారతులు, ఆభరణాలతోపాటు ప్రత్యేక పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. బుధవారం జరిగే దేవర ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు పకడ్బందీగా ఏర్పాటు చేశామని సర్పంచ్ ఆరుబోట్ల నాగమ్మ పాత్రికేయులకు తెలిపారు.

ఎనిమిదేళ్ళుగా పని చేసిన నన్ను ఎలా తొలగిస్తారు..

విశాలాంధ్ర - ఆలూరు : అధికార్లను బ్లాక్ మెయిల్ చేసి ఉద్యోగం ఇవ్వకపోతే ప్రెస్ మీట్ పెట్టి మీ ఉద్యోగాలు తీయిస్తానని అధికార్లను బ్లాక్ మెయిల్ చేసి తిరిగి డైలీ వేజెస్ ద్వారా డీహెచ్ లక్ష్మి దేవి విధులోకి చేరడం జరిగిందని, దీంతో ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న తనకు అన్యాయం జరిగిందని ఆలూరు మోడల్ హాస్టల్ మాజీ చౌకీదార్ బూర్ల సుశీల ఆవేధన వ్యక్తం చేసింది. మంగళవారం ఆలూరు ఎంఈఓ కార్యాలయం వద్ద ఆమె విలేఖర్లతో మాట్లాడారు. గత ఏడాది నవంబర్ 18న చౌకీదార్‌గా ఔట్ సోర్సింగ్ విధానంలో విధుల్లో చేరిన లక్ష్మిదేవి పని చేతకాక, డిసెంబర్ 22, 2024న ఇష్టపూర్వకంగా రాజీనామా చేసినట్లు తెలిపారు. దీంతో వెంటనే ప్రిన్సిపాల్ సూచన మేరకు తాను తిరిగి విధ్దులో చేరానని, గత నెల జనవరి 8న ఆమె తన తొందరపాటు వల్ల తన భర్తకు తెలియకుండా ఉద్యోగానికి రాజీనామా చేశానని, తప్పైందని, క్షమించి తిరిగి తన ఉద్యోగం ఇవ్వాలని లెటర్ ఇచ్చి ప్రిన్సిపాల్, వార్డెన్ తనకు తెలియకుండా తెల్ల కాగితంలో రాజీనామా చేసినట్లు పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసిన విషయం విచారణలో కూడా బయట పడిందని ఆమె తెలిపారు. ఇన్ని తప్పులు చేసిన ఆమెను ఎంఈఓ చిరంజీవి రెడ్డి ఎలా విద్దులోకి చేర్చుకున్నాడని ఆమె ప్రశ్నించారు. మోడల్ స్కూల్‌లో మధ్యాహ భోజనం ఏజెన్సీ కూడా నిర్వహిస్తుందని, రెండు పోస్టుల్లో ఆమెనే కొనసాగిస్తూ తనకు జీవనాధారమైన ఉద్యోగాన్ని తీసివేసి అన్యాయం చేశారని ఆవేధన వ్యక్తం చేసింది. ఈ విషయంపై జిల్లా అధికార్లు విచారణ జరిపి, న్యాయం చేటపోతే ఆలూరు ఎంఈఓ కార్యాలయం వద్ద దీక్ష చేపడతానని ఆమె విలేఖర్ల సమావేశంలో తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, నంద్యాల జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. నేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ప్రముఖ సీనియర్ వైద్యులు డా.గెలివి సహదేవుడు పిపిటి స్లైడ్స్ ద్వారా వివిధ రకాల క్యాన్సర్ ఛాయా చిత్రాలను చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ జయించిన రెడ్ క్రాస్ వైస్ చైర్మన్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ అధినేత మారుతి కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొనగా సుమారు 400 మంది విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు రెడ్ క్రాస్ డీఎఫ్ఓ అబ్దుస్ సమి తదితరులు పాల్గొన్నారు. క్యాన్సర్‌ను జయించిన రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ మారుతి కుమార్ మాట్లాడుతూ తన అనుభవాలను, బాధలను, ఆత్మవిశ్వాసంతో కోలుకున్న విధానాన్ని, ఆత్మవిశ్వాసం మనోధైర్యంతో దేన్నైనా జయించవచ్చని విద్యార్థులకు వివరించారు.

చిన్న వ్యాపారస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి : ఎస్.మునెప్ప

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : చిన్న వ్యాపారస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి ఎస్ మునెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని వినాయక ఘాట్, కేసీ కెనాల్ ప్రక్కన రోడ్డు సైడ్ తోపుడు బండ్లు, షెడ్లలో వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాను ఎస్.మునెప్ప ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి కర్నూల్ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా నగర అధ్యక్షులు బి.వెంకటేష్, ఉపాధ్యక్షులు పి.రామకృష్ణారెడ్డి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణారెడ్డి, చిన్న వ్యాపారస్థుల సంఘం నగర కార్యదర్శి చింతల, మహేష్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.ఈశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై, ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ కర్నూలు నగరంలో అనేక గ్రామాల నుండి వలస వచ్చి ఉపాధి అవకాశాలు లేక కుటుంబాలను పోషించుకోవడానికి రోడ్డు సైడ్ తోపుడు బండ్లపైన చిన్న, చిన్న బంకుల్లో, షెడ్లు వేసుకుని కూరగాయలు, పండ్లు టిఫిన్లు అమ్ముకుంటూ వేలాదిమంది కార్మికులు జీవిస్తున్నారన్నారు. వీరికి వ్యాపారాలు బాగా జరిగితే లాభం లేకపోతే నష్టం అనే పద్ధతులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రోడ్డుపై బండ్ల పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్న చిన్న వ్యాపారుల పట్ల మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సానుభూతి తో ఉండాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది కాకుండా, ప్రధానమైన కూడలిలో చిన్న వ్యాపారస్తులకు ప్రభుత్వమే షెడ్లు నిర్మించి, వ్యాపారాలు చేసుకునేందుకు సహాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో నల్లన్న, పురుషోత్తము, రేణుక, బాష చిన్న వ్యాపారస్తులు గిడ్డయ్య, రమేష్ సరస్వతి, లక్ష్మీదేవి, జయరాముడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ 'బీ'గా గ్రేడ్ గుర్తింపు

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంగళవారం న్యాక్ సంస్థ కళాశాలను సందర్శించి బీ గ్రేడ్‌గా గుర్తింపు పొందినదని కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కళాశాల 'బీ' సాధించడం కళాశాల అభివృద్ధికి ఒక మైలురాయిగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇది అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సమిష్టి విజయం అని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల గ్రేడ్ సాధించడంలో తోడ్పడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి కొరకు రూ.55 వేల విరాళం ఇచ్చిన సన్నిథి చంద్రశేఖర్, రూ.50 వేల విరాళం ఇచ్చిన విశ్రాంత చరిత్ర అధ్యాపకులు మల్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ సమన్వయకర్త ఈవీ భాస్కర రెడ్డి, యు.వెంకటేశ్వర రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు టౌన్: ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించే విధంగా పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక మాచాని సోమప్ప పార్క్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రధాన రహదారుల్లో వాకింగ్ ట్రాక్ల ఏర్పాటుకు సోమప్ప సర్కిల్ వద్ద రహదారులను పరిశీలించారు. పార్క్ అభివృద్ధికి కావాల్సిన సౌకర్యాలు, సదుపాయాలు ఏర్పాటు గురించి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఉన్న పార్కులను ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే విధంగా తయారు చేస్తామని తెలిపారు. పట్టణంలోని మరో రెండు పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం పార్కులో కావాల్సిన సౌకర్యాలు ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఉదయం పూట ప్రజలు వచ్చే వాకింగ్ కు, వ్యాయామంకు కావలసిన ఏర్పాట్ల గురించి చర్చించినట్లు తెలిపారు. అలాగే ప్రధాన రహదారుల్లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీడీపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - వెలుగోడు: మండలంలోని అబ్దుల్లాపురం, గుంత కందాల గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న పంటను పరిశీలించి మెలుకువలు తెలిపారు. పాడిపంటలు మాసపత్రిక కొరకు ఏడాదికి రూ.300 చెల్లించి రైతులు ఆధునిక వ్యవసాయ సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు. మొక్కజొన్న పంట సాగుకు సారవంతమైన, నీరు ఇంకే నల్లరేగడి నేలలు అనుకూలమైనవన్నారు. నీరు నిల్వ ఉండే భూములు పనికిరావన్నారు. విత్తన మోతాదు 8 కేజీలు ఎకరానికి వేసుకోవాలని, కిలో విత్తనాలకు 3 గ్రాముల మంకోజెబ్ లేదా థైరం లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకున్నట్లయితే లేతదశలో మొక్కలను తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది అప్సర్, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఎల్కే ఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా ఎల్కే ఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు క్యాన్సర్ అవగాహనా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాన్సర్ వ్యాధి యొక్క నివారణ, జాగ్రత్తల గురించి తెలియజేశారు. అలాగే విద్యార్థులకు జంక్ ఫుడ్ తినడం వల్ల కలిగే నష్టాలు, వాటిలో ఉపయోగించే కెమికల్స్ క్యాన్సర్ కి కారణం అవుతాయన్నారు. పిల్లలను ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ లో వాటర్ తాగడం హానికరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోటి నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలాదేవి, కోఆర్డినేటర్స్, ఏవో, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీసర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా చూడండి

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని పెద్ద హ్యాటలో జరిగే రీసర్వే పైలెట్ ప్రాజెక్టును మంగళవారం ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. ఎషుర్వే పనులు, రికార్డులను పరిశీలించారు. పొలాలకు వెళ్లి రెవెన్యూ అధికారులకు రీసర్వే పనుల గురించి వివరించారు. రీసర్వే వల్ల ఏ ఒక్క రైతుకు నష్టం కలగకూడదని అన్నారు రిసర్వే వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని, రైతులు రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చిన్న హ్యాట సచివాలయాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. రీసర్వేలో తహశీల్దార్ నిజాముద్దీ న్, డిప్యూటీ ల్యాండ్ సర్వేయర్ వేణు సూర్య, వీఆర్ఓ ప్రహల్లాద, సర్వేయర్ నాగరాజ్ పాల్గొన్నారు.

బిజినవేములలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : కోయిలకుంట్ల మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం చేపట్టినట్టు మండల వ్యవసాయ అధికారి నిరంజన్ నన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వివిధ పంటల్లో వస్తున్న దిగుబడి,మార్కెట్ రేట్లు గురించి చర్చించడం రైతులతో చర్చించడం జరిగింది అన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు డిజిటల్ అగ్రికల్చర్‌లో భాగంగా ప్రతి రైతు సేవా కేంద్రంలోని రైతులందరికీ అగ్రి స్టాక్ ప్రాజెక్టు కింద ఫార్మర్స్ రిజిస్ట్రీ ఆన్లైన్ అప్లికేషన్ ద్వారా రైతులను నమోదు చేయడం జరుగుతున్నది ఆయన తెలిపారు.

తమ్మడపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

విశాలాంధ్ర - బనగానపల్లె: వెంకటాపురం, తమ్మడపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడిఏ సెరికల్చర్ పరమేశ్వరి మొక్కజొన్న పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ గురించి రైతులకు తెలిపారు. రైతులు సెరికల్చర్ సాగును చేపట్టాలని ప్రభుత్వం రాయితిపై షెడ్డు, మొక్కలకు ఏర్పాటు చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు డిసిఎంఎస్ మేనేజర్ శంకర్, వ్యవసాయ సిబ్బంది టిడిపి నాయకుడు గడ్డం నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఆర్జేసీ

విశాలాంధ్ర - మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో జరగబోయే శివరాత్రి ఏర్పాట్లను తిరుపతి మల్టీ జోన్2 రీజనల్ జాయింట్ కమీషనర్ చంద్ర శేఖర ఆజాద్ పరిశీలించారు.మంగళవారం మహానంది క్షేత్రానికి వచ్చిన ఆయన ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి తో కలసి ఆలయ ప్రాంగణంలో కలియ తిరిగారు. సామాన్యభక్తులకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ప్రతి భక్తుడికి ప్రసాదం అందేలా చూస్తామన్నారు. అమ్మవారి ఆలయం, కోదండ రామాలయంలో ఉన్నటువంటి శిల్ప కలను చూసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. మండపాలలో ఉన్నటువంటి పురాతన శిల్పాలను ప్రత్యేకంగా పరిశీలించారు. శానిటేషన్, క్యూ లైన్ల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అన్నవితరణ కేంద్రాన్ని పరిశీలించి రుచులు బాగున్నాయని కితాబునిచ్చారు. అంతకు ముందు శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్ల కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఏ ఈఓ మధు, సూపర్డెంట్లు శశిధర్ రెడ్డి,దేవిక, టెంపుల్ ఇన్స్పెక్టర్లు ఆర్ఎస్ శ్రీనివాసులు, శ్రీశైలం శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మల్లయ్య,ఏ ఈ శ్రీనివాసులు, మల్లికార్జున, తదితరులు ఉన్నారు.

రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నాఫెడ్ శర్మ, మార్క్‌ఫెడ్ డిఎం హరినాథ్ రెడ్డి, అగ్రికల్చర్ ఏడిఏ రామ్మోహన్ రెడ్డి, జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో నాఫెడ్ మరియు మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్క్ఫెడ్ డిఎం హరినాద్ రెడ్డి, ఏడిఏ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గం లో 2400 మంది రైతులు 5800 ఎకరాలు కంది సాగు చేశారన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రైతులకు కూటమి ప్రభుత్వ&, భూమా అఖిలప్రియ అండగా ఉంటారని, రైతు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను దళారుల నుండి కాపాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యాడ్ సెక్రెటరీ నారాయణస్వామి, సూపర్వైజర్ సురేష్, డీసీఎంఎస్ నాగ ప్రవీణ్, రవి, ఏవో కిషోర్ కుమార్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్చార్జి పత్తి నాగేశ్వర్ రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీడాభారతి ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల క్రాంతి నగర్ నందలి శ్రీ శాంతినికేతన్ సిబిఎస్ఈ పాఠశాలనందు క్రీడాభారతి ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల అధినేత, రాష్ట్ర క్రీడాభారతి ఉపాధ్యక్షులు డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, హేమంత్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ మాట్లాడుతూ రథసప్తమి నాడు ఉదయమే సూర్యనమస్కారాది కార్యక్రమాలు నిర్వహిస్తే సూర్యుని నుండి వెలువడే అత్యంత శక్తిని పొంది శారీరకంగా, మానసికంగా దృఢత్వం పొందుతారన్నారు. సూర్యుని నుండి వెలువడే శక్తి ఒక్క మానవులకు మాత్రమే కాకుండా సకల చరాచర జగత్తు ఈ శక్తి పొందుకుంటుందన్నారు.

పరీక్షలపై అవగాహన కల్పించిన

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్) కర్నూలు నందు, ఆర్ఐఓ గురువయ్య శెట్టి అధ్యక్షతన, డివిఈఓ వై.పరమేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రిన్సిపాల్స్, సైన్స్ లెక్చరర్స్ కంప్యూటర్ ఆపరేటర్‌లుకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్ఐఓ గురువయ్య శెట్టి మాట్లాడుతూ కోషన్ పేపర్ ఏవిధంగా డౌన్లోడ్ ఎగ్జామ్ మిషన్స్ మార్క్స్ విధంగా పోస్ట్ చేయాలి అన్న విషయాలపై సంపూర్ణ అవగాహన కలిపించారు. డివిఈఓ డి.పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రాక్టికల్స్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీసీ కెమెరాలు ఏర్పాటు విషయంపై సవివరంగా అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప డీఈసీ మెంబర్స్ కె.నాగభూషణ రెడ్డి, యు.పద్మావతి, జీఎస్ సురేష్ చంద్ర, ప్రిన్సిపాల్ సి.సుంకన్న, జీజేఎల్ఏ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: సామాజిక సేవా కార్యక్రమంలో అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ టీం ఆధ్వర్యంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా మంగళ వారం నాడు ఉలిందకొండ-2 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ మీద అవగాహన కార్యక్రమానం నిర్వ హిరిచారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఈ పెన్షన్ అబ్దుల్ రజాక్ వలి బాబు ఎంఈఓ లీలావతి భటితరం విద్యార్థులకు ఆపదలో ఉన్నప్పుడు తమను తాము రక్షించుకోవడం గురించి తెలిపారు. అశోకా విద్యార్థుల సామాజిక బాధ్యతను తలావతి ఈ కార్యక్రమంలో పాఠశాల ఇచ్చింది. ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ కూడా పాల్గొన్నారు.

పదో తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు: విద్యార్థులందరూ తప్పనిసరిగా నులి పురుగులు నివారించే అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమంలో భాగంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1-19 ఏళ్లలోపు విద్యార్థులందరి చేత నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని సంబంధిత విద్యాశాఖల అధికారులు, ఐసిడిఎస్ పిడిని ఆదేశించారు..1886 అంగన్వాడీ కేంద్రాలు, 2231 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 103 జూనియర్ కళాశాలలు, 22 ఐటీఐ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులందరిచేత ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు కూడా వేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు.. ఫిబ్రవరి 10 వ తేదీన మండల స్పెషల్ ఆఫీసర్లు, మునిసిపల్ కమిషనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రలను పిల్లలకు పంపిణీ జరుగుతుందని, ఒక వేళ ఈ రోజున మాత్రలు వేసుకోని పక్షంలో వారికి మళ్ళీ మాప్ అప్ కార్యక్రమం ద్వారా ఈనెల 17వ తేదీన అల్బెండజోల్ మాత్రలను అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

ఉపాధి పనివద్దనే కూలీల హాజరు వేయాలి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: ఉపాధి హామీ పనుల వద్దనే కూలీలకు మాస్టర్‌లో హాజరు తప్పనిసరిగా వేయాలని ఉపాధి ప్రోగ్రాం అధికారి మోహన్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఎవరికైనా జాబ్ కార్డు లేకుంటే దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కొలతలకు ప్రకారంగా పనులు చేసినట్లయితే కూలి వేతనం తక్కువ కాకుండా వస్తుందన్నారు. అనంతరం ఆయన హార్టికల్చర్ సంబంధించిన చీని చెట్ల తోటను ఆయన పరిశీలించారు. పండ్ల మొక్కలను నాటుకొని అధిక దిగుబడి సాధించాలని ఆయన రైతులని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఈసీ మధు కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ ప్రతాప్,ఫీల్డ్ అసిస్టెంట్ పులికొండ, సీనియర్ మేటీలు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎంపీ మద్దిలేటిరెడ్డి రెడ్డి మృతి బాధాకరం

విశాలాంధ్ర - బనగానపల్లె: ఉయ్యాలవాడ మండలం సుద్దమళ్ళ గ్రామ వాస్తవ్యులు, సుప్రసిద్ధ సముద్ర శాస్త్ర వేత్త డాక్టర్ ఎంపీ. మద్దిలేటిరెడ్డి (90) మరణం బాధాకరమని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. డాక్టర్ మద్దిలేటిరెడ్డి కర్నూలు సన్ రైజ్ హాస్పిటల్‌లో మంగళ వారం కన్నుమూశారు. డాక్టర్ మద్దిలేటిరెడ్డి ఆకస్మిక మృతిపై బిసి రాజారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. మద్దిలేటి రెడ్డితో తనకు ఎంతో సన్నిహిత సంబంధాలు ఉన్నా యన్నారు. ఆయన తెలుగు కళా స్రవంతిని స్థాపించి అసాధారణ సేవలు అందించారన్నారు. మద్దిలేటి రెడ్డి రచించిన సముద్ర శాస్త్రాన్ని ప్రపంచం లోని అన్ని యూనివర్సిటీల్లో పాఠాలుగా బోధిస్తు న్నార న్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డ్ హెచ్ఎం కీ.శే.గోవింద రెడ్డికి సొంత సోదరుడు డాక్టర్ ఎంపీ మద్దిలేటిరెడ్డి అని గుర్తు చేసుకున్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటల సందర్శన

విశాలాంధ్ర ఆత్మకూరు టౌన్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం చెందిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, నంద్యాల ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.ఎ.రామకృష్ణా రావ్, డా.ఎస్.నీలిమ, డా.వి.చైతన్య, ఎడిఎ బి.ఆంజనేయ, మండల వ్యవసాయ అధికారి డి.విష్ణువర్ధన్ రెడ్డి సంయుక్తంగా కలిసి ఆత్మకూరు మండలంలో కరివేన, కృష్ణాపురం ఆత్మకూరు అర్బన్ కురుకుంద గ్రామాలలోని మినుము పంటలను సందర్శించడం జరిగింది. రసం పీల్చే పురుగులు నివారణ కోసం రైతులు ఈ క్రింది నివారణ చర్యలు చేపట్టాలని డా.ఎ.రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ రైతులకు సూచించారు.

ఘనంగా మఖ్దూం మొహియుద్దీన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పట్టణంలోని స్థానిక నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో కీ.శే. మఖ్దూం మొహియుద్దీన్ జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి పులహారం వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద పాల్గొని ప్రసంగించారు. మఖ్దూం మొహియుద్దీన్ స్వాతంత్ర్య సమర యోధుడిగా, ఉర్దూ కవిగా, ప్రముఖ కార్మిక నాయకుడుగా, మాజీ శాసన సభ్యులుగా, మాజీ శాసన మండలి సభ్యులుగా, ఉపాధ్యాయ ఉద్యమానికి, ఎస్టియుకు ఊతమిచ్చిన మహాను భావుడని కొనియాడారు. మఖ్దూం మొహియుద్దీన్ రాష్ట్రోపాధ్యాయ సంఘం రూపకర్త, వ్యవస్థాపకులు, ప్రగతి శీల భావాలతో పండితుల పక్షాన కలమెత్తి నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప పోరాట కమ్యూనిస్టు యోధుడని, నిజాం నిరంకుశ పాలనలో విద్యా, ఉపాధ్యాయుల విలువలను,హక్కులను కాపాడేందుకు చేసిన పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, భీమరాజు, ఎస్టీయూ నాయకులు లోక్య నాయక్,సుధాకర్,రాజ్ సతీష్, ప్రసాద్, మారయ్య, జంబులయ్య, కలిల్, జుబేర్, గురురాజా, విజయ్ కుమార్, రాముడు, గంగ నాయక్ మనోహర్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీజివోస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: ఏపీ ఎన్జీజివోస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఏపీ జేఏసీ చైర్మన్ వి సి హెచ్ వెంగల్ రెడ్డి జరిగింది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారైన పి రంజిత్ భాష ముఖ్య అతిథిగా హాజరై ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు బెస్ట్ ఎలక్ట్రోల్ అవార్డు పొందిన జిల్లా కలెక్టర్ కు ఏపీ జెఎసి నాయకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు కర్నూలు నగర అధ్యక్షులు ఎం.కాశన్న, నగర కార్యదర్శి రామకృష్ణ, టైపిస్టు, స్టెనో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, ప్రభుత్వ నాల్గొవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈ మద్దిలేటి, జిల్లా కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మహిళా విభాగం చైర్మన్ చందన, ఏపీ గవర్నమెంట్ నర్సిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, బంగారి, ఏపీ ఫార్మసిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగస్వామి, రాజేష్, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు ఈశ్వరయ్య, ఏపీ ఎన్జీవో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, జాయింట్, సెక్రటరీ చిరంజీవి,నగర కార్యవర్గం హరికృష్ణ గౌడ్, రాఘవేంద్ర, సుభాషిని, వరలక్ష్మి, చలపతి, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.